క్లుప్తంగా

బంగారు పడిగె కానుక


బంగారు పడిగెను అందిస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి వారికి భక్తులు బంగారు పడిగెను బహూకరించినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన బాష్యం సుబ్బనరసయ్య గౌడ్, మల్లమ్మ దంపతుల కుమారుడు నాగమనోహర్, భార్య సరితలు 10 గ్రాముల బంగారు పడిగె సమర్పించారు. దాతల కుటుంబానికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


కోడుమూరులో రక్తదానం చేస్తున్న యువకుడు

కోడుమూరు రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం కోడుమూరులో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించగా 20 మందికి పైగా రక్తదానం చేశారు. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రాజు, శేషుకుమార్, వ్యాయామ విద్య పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు దేవేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రంగస్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద


తొగర్చేడు వద్ద కుందూ నీటి ప్రవాహం

పాణ్యం: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు ఆదివారం తెల్లవారుజాము నుంచి తగ్గుముఖం పట్టడంతో వరద నీరు కూడా తగ్గింది. పైప్రవాహం కారణంగా కుందూనది ప్రమాద అంచుల్లో ప్రవహించింది. అయితే వర్షాలు తగ్గడంతో నీటి ప్రవాహం కూడా తగ్గింది. దీంతో గ్రామాల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గగ్గటూరు గ్రామం ముందు ఉన్న మునుగుందు వాగులో ప్రవాహం తగ్గడంతో ప్రజలు ట్రాక్టర్ల సాయంతో వాగుదాటారు. మూడు రోజుల వర్షాల వల్ల పొలాల్లో నీరు నిల్వ ఉండగా, రైతులు దాన్ని బయటకు పంపేందుకు పలు ప్రయత్నాలు చేశారు. ఆదివారం ఎండ రావడంతో పంటలకు ఊపిరి లభించింది.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి


లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన తహసీల్దార్

ఓర్వకల్లు: రేషన్‌దుకాణాల్లో కార్డుదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. ఆదివారం మండలంలోని నన్నూరు గ్రామంలో పౌరసరఫరాల శాఖ ద్వారా మంజూరు చేసిన నూతన రేషన్ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. డీలర్లు సకాలంలో దుకాణాలు తెరిచి రేషన్ సరుకులను అందజేయాలని తెలిపారు. స్థానిక నాయకులు బి.విశ్వేశ్వరరెడ్డి, తలారి విజయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జాకీర్ హుస్సేన్, బుజ్జప్ప, ఖాజామియ్యా, రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశించారు. ఆమె ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పకుండా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

గ్రామాలకు గంజాయి మరక

- గుట్టు చప్పుడు కాకుండా గంజాయి వాడకం
- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు
- గంజాయికి బానిసలుగా మారుతున్న యువత


పంచలింగాల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పంచలింగాల గ్రామం కేంద్రంగా గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ నెల 14వ తేదీన దాదాపు 20 కేజీల గంజాయి రవాణా చేస్తూ కర్నూలు నగరంలో నాలుగవ పట్టణ పోలీసులకు పట్టుబడటం గమనార్హం..

కబడ్డీ క్రీడాకారులకు పేట్టింది పేరు

పంచలింగాల గ్రామం కబడ్డీ క్రీడాకారులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి ఎంతోమంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారు. అలాగే గొప్పగా చదువుకొని ప్రభుత్వ శాఖలలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించిన వారు ఎందరో ఉన్నారు. పలువురు స్పోర్ట్స్ కోటా ద్వారా పోలీసు శాఖ, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా రాణిస్తున్నారు. ఎంతో మంది క్రీడాకారులు, ప్రభుత్వ ఉద్యోగులను అందించి పంచలింగాల గ్రామం ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇలాంటి గ్రామం ప్రస్తుతం గంజాయి కోరల్లో చిక్కుకోవడంతో ప్రతిష్ఠ మసకబారుతోంది. గ్రామ సమీపాన జిల్లా కారాగారం ఉండటంతో ఏదో ఒక మార్గంలో ఇక్కడ గంజాయి రవాణా అవుతోంది. గ్రామ ప్రవేశ మార్గంలోనే పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులచే నిత్యం వాహనాల తనిఖీ ఉంటుంది. అయినా చెక్‌పోస్టును దాటుకోని గంజాయి ఎలా వస్తోందో ? గ్రామం నుంచి ఎలా తరలిపోతుందో అర్థం కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తరచుగా గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అయినా గతేడాది నుంచి గ్రామంలో గంజాయి వినియోగం పెరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని బీసీ కాలనీ, ముస్లిం వీధి, పంచముఖి లైన్, పాట్లు ఏరియా, ఉరువాకిలి పరిసర ప్రాంతాల్లో నివాసదారులు గ్రామానికి చెందిన యువకులు దాదాపు 15 మంది గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. న్యూస్ పేపర్లలో గంజాయిని పొట్లాలుగా చుట్టి పరిమాణం బట్టి లేదా బరువు బట్టి అమ్మకాలు జరుపుతున్నారు. గంజాయి అమ్మకాల కారణంగా గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారని స్థానిక మహిళలు గతంలో గ్రామ సచివాలయ అధికారులకు తెలిపారు. గ్రామంలో భాగమైన స్కాంద వెంచర్‌లోనూ గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో హైస్కూల్ పిల్లలు, కొందరు కాలేజీ చదివే విద్యార్థులు, గ్రామంలో అల్లరి చిల్లరగా తిరిగే యువకులతో పాటు పెద్ద వయస్సు ఉన్న వారు కూడా గంజాయి సేవిస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు- హైదరాబాద్ నేషనల్ హైవే పక్కన గంగమ్మ ఆలయం, సుబ్రమణ్యేశ్వర ఆలయం తుంగభద్ర నది ఒడ్డున ఉన్నాయి. చీకటి పడిన తరువాత ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఇక్కడ గంజాయి అమ్మకాలు జరుగుతుంటాయి. నగరం నుంచి యువకులు ఇక్కడికి వచ్చి గంజాయి సేవించడం, కొనుగోలు చేసే క్రమంలో గొడవలు, ఘర్షణలు జరుగుతుండటం వల్ల ఈ ఆలయాలకు భక్తులు రావడం మానేశారు. దీంతో ఆ పరిసరాలు ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉంటాయి. పిల్లలను బాగా చదివించి వారిని ఒక స్థాయిలో చూడాలని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తుంటే గ్రామంలోని యువత గంజాయి వ్యసనానికి బానిసలై ఆరోగ్యంతో పాటు జీవితం నాశనం చేసుకుంటూ చివరికి గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడటంతో కటకటాలపాలై తల్లిదండ్రులకు అప్రతిష్ఠతో పాటు భారంగా మారుతున్నారు.

- మండల పరిధిలోని నిడ్జూరు గ్రామానికి 2 కి.మీ దూరంలో హైస్కూల్ సమీపాన 2009 వరదల్లో ఇళ్లు నష్టపోయిన వారి కోసం దాదాదాపుగా 650 ఇళ్లను అప్పటి ప్రభుత్వం నిర్మించింది. అయితే ఆ ఇళ్లలో ఎవరూ చేరకపోవడంతో మునగాలపాడు, నిడ్జూరు యువకులు అక్కడికి చేరి గంజాయి సేవించడం, మద్యం తాగడం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.
- ఇ. తాండ్రపాడు గ్రామం ప్రక్కనే పంచలింగాల గ్రామం ఉండటం వల్ల గత కొన్ని నెలలుగా కొందరు యువత పంచలింగాలలో ఉన్న వారి స్నేహితుల పరిచయంతో గంజాయి సేవించేందుకు అలవాటుపడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు.
- మిటలరీ కాలనీ, భుపాల్ నగర్‌లో కొందరు యువత నందనపల్లె నుంచి భూపాల్ నగర్‌కు వెళ్లే దారిలో నిర్మాణ పనులు ఆగిపోయిన సచివాలయ ప్రాగణంలో, గార్గేయపురం చెరువు వద్ద ఉన్న వెంచర్లలో గుట్టు చప్పుడు గాకుండా గంజాయి సేవిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి గ్రామంలో గంజాయిని నిర్మూలించాలని, యువత గంజాయి బారిన పడి జీవితాలను నాశనం చేసుకోకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నిడ్జూరు సమీపంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రదేశం

వంతెనలు నిర్మించాలి


లో లెవల్ బ్రిడ్జిపై వరద నీటిని చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: దేవనగర్, కల్లూరు వక్కెర వాగుపై కొత్త బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ప్రతినిధి బృందం కల్లూరు హంద్రీనది, కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సుధాకరప్ప మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా కురిసిన వర్షాల వల్ల హంద్రీ నది ఉధృతంగా ప్రవహించడంతో కల్లూరు వక్కెర వాగుపై రాకపోకలు నిలిచిపోయాయన్నారు. బ్రిడ్జిపై వరద నీరు ప్రవహించిన ప్రతిసారి ప్రయాణికులు ఎక్కడి వారు అక్కడ ఆగిపోవలసి వస్తుందన్నారు. అలాగే దేవనగర్ బ్రిడ్జిపై నీరు ప్రవహించడం వల్ల రాకపోకలు బంద్ అయ్యాయన్నారు. కల్లూరు నుంచి కర్నూలు వెళ్లే ప్రయాణికుల రాకపోకలు బంద్ కావడంతో పది కిలోమీటర్ల దూరం ప్రయాణించి కర్నూలు నగరంలోకి చేరుకోవాల్సి వస్తుందన్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కల్లూరుకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఓ వైపు హంద్రీనది, మరోవైపు వక్కెర వాగు కల్లూరు ప్రాంతానికి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే చెంచునగర్ కాలనీలో నీరు ప్రవేశించి ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి దేవనగర్, కల్లూరు వక్కెరపై కొత్త బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. అధికారులు స్పందించకుంటే ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు యేసు, శ్రీనివాసులు, గోవిందు, నాగరాజు, రమేష్, షేక్షావలి, మురళి, ఎల్లరాజు, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ నదికి తగ్గిన వరద


కోడుమూరు వద్ద హంద్రీ నదికి తగ్గిన వరద ఉధృతి

కోడుమూరు రూరల్: గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి వరద నీటి విడుదలను ఆదివారం ప్రాజెక్టు అధికారులు నిలిపేశారు. దీంతో కోడుమూరు వద్ద హంద్రీ నదిలో వరద నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను నిలిపివేయడంతో ఆదివారం సాయంత్రానికి నదిలో నీటి ప్రవాహం సాధారణ స్థాయికి చేరుకుంది. హంద్రీ నదికి భారీగా వరద నీటిని విడుదల చేయడంతో నదీతీర గ్రామాల ప్రజలు, రైతులు రెండు రోజుల పాటు భయాందోళనల మధ్య కాలం గడిపారు. హంద్రీకి వరదనీటి ప్రవాహంతో నదీతీరం వెంట ఉన్న పొలాల్లోకి భారీగా వరదనీరు చేరి పంట పొలాలు నీటమునిగాయి. దీంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


సి.బెళగల్ చెరువులో అలుగెక్కి పారుతున్న నీరు

అలుగెక్కి పారిన నీరు

సి.బెళగల్: మండల కేంద్రంలోని చెరువు మూడేళ్ల తరువాత వర్షపు నీటితో పొంగి పొరలింది. మండలంలో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో ఆదివారం బేరు (అలుగు) ఎక్కి పారింది. గతంలో 2020, 2021, 2022లో వరుసగా ముడేళ్ల పాటు నిండిన చెరువు, తర్వాత ఇప్పుడు మరోసారి నిండటంతో గ్రామ రైతులు, ప్రజలు, మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు 1943 ఎకరాల విస్తీర్ణంలో ఉండి దాదాపు 450 ఎకరాలకు పైగా ఆయకట్టు భూములు ఉండగా, ప్రస్తుతం కేవలం వందలోపు ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలను సాగు చేస్తున్నారు. చెరువు నిండి అలుగెక్కి పారడంతో యువకులు, చిన్నారులు నీటిలో సందడి చేస్తూ గడిపారు.

మహాచండీగా అమ్మవారు


ఈశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని ఈశ్వరాలయంలో కొలువైన దుర్గమ్మ, పాత బస్టాండ్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలోని అమ్మవారు 7వ రోజు మహాచండీగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు.


లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో..


వెంకాయపల్లె ఎల్లమ్మ దేవి

కర్నూలు(రూరల్): మండలంలోని నిడ్జూరు, మునగాలపాడు గ్రామ పరిధిలో తుంగభద్ర నది ఒడ్డున మామిడి తోటలో వెలసిన దుర్గమ్మ వారు కాళికా దేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు విశేష పుజాలు నిర్వహించారు. అమ్మవారికి నిమ్మకాయల దండలు, బంతిపూల మాలలతో అలంకరించి కాయకార్పూరాలు సమర్పించారు. భక్తులు అమ్మవారి స్తోత్రాలు పఠించారు. జై దుర్గాభవాని నామస్మరణతో భజనలు చేశారు.

- దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వెంకాయపల్లె ఎల్లమ్మను కాళికా దేవి అలంకరణలో ముస్తాబు చేశారు. కుంకుమార్చన, శివాభిషేకం, మహా మంగళహారతి పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.
- నందనపల్లె ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.


వల్లెలాంబదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాతా, శ్రీరాములమ్మ, తులజా భవాని, మాతా అంబాభవాని, వల్లెలాంబదేవి ఆలయాల్లో మహాచండి దేవిగా దర్శనమివ్వడంతో ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. అలాగే వల్లెలాంబదేవి ఆలయంలో మహాచండిగా దర్శనమిచ్చిన అమ్మవారికి విశేష పూజలు, పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో పూలవాసు, భానుప్రకాష్, భక్తులు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరు మండలంలోని కె.నాగలాపురంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమివ్వగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కల్లూరు: కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధిలోని హరిహర దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం చండీహోమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. హరిహరి దేవాలయం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


చండీహోమంలో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

మహాచండీదేవిగా అమ్మవారి దర్శనం

పాణ్యం: మండలంలోని ఆలయాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం నవరాత్రుల ఆరో రోజు అమ్మవారిని చండీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పాణ్యంలోని హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని నిర్వహకులు చండీదేవిగా అలంకరించారు. అయ్యప రెడ్డి కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మహా చండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే రైల్వే స్టేషన్ సమీపంలోని కనకాదుర్గా ఆలయంలో అమ్మవారు మధురమీనాక్షి దేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం సంతమార్కెట్‌లో కొలువుంచిన అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లొద్దిపల్లెలో దుర్గాదేవి మహాచండీదేవిగా పూజలందుకున్నారు.


లొద్దిపల్లెలో మహాచండీదేవిగా..

అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


మధుర మీనాక్షిగా..


పాణ్యం ఏఆర్ కాలనీలో..


హుసేనాపురంలో..


పాణ్యంలో మహాచండీ

శాకాంబరిదేవి.. నమోస్తుతే

గడివేముల: స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శాకంబరీదేవి రూపంలో దర్శనమిచ్చారు. అలాగే ప్రత్యేకంగా అలంకరించిన రాధా మాధవుల అలంకరణ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, అమ్మవారి అష్టోత్తరం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఉదయగిరి శివయ్య, బొంతల మధుసూదన్ గుప్తా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శాకంబరీదేవిగా వాసవీమాత


చిన్నారులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అలరించిన కూచిపూడి ప్రదర్శన

స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నంద్యాల నుంచి వచ్చిన మానస కూచిపూడి బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ఆర్యవైశ్యం సంఘం నాయకులు చిన్నారులను ఘనంగా సన్మానించారు.

ఆలయ నిర్మాణం మహాద్భుతం

కోడుమూరు రూరల్: కోడుమూరులో దాతల సహకారంతో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పునర్ నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందని విశ్వహిందూ పరిషత్ సౌత్ ఇండియా అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. కోడుమూరులో దాతల సహకారంతో రూ.16 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణాన్ని ఆదివారం నందిరెడ్డి సాయిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిమెంట్, ఇసుక ఉపయోగించకుండా పురాతన పద్ధతిలో రాతిశిలలు, దూలాలతో ఆలయాన్ని నిర్మిస్తుండడం అద్భుతం అని ప్రశంసించారు. ఈ ఆలయం శతాబ్దాల పాటు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అంతకుముందు ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆలయ పునర్ నిర్మాణ విశేషాలను నందిరెడ్డి సాయిరెడ్డికి వివరించారు. భజరరంగదల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ రాజేష్, గురుమూర్తి, నాగేశ్వరరావు, మహేష్‌నాయుడు, అశోక్, నటరాజు, షణ్ముఖ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వీహెచ్‌పీ అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డికి ఆలయ నిర్మాణ విశేషాలను వివరిస్తున్న మహేశ్వరరెడ్డి

గుంతలను పూడ్చండి


రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపు నీరు

కర్నూలు(రూరల్): గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ఇటీవల వర్షాలకు నీరు చేరుతోందని, గుంతలను పూడ్చివేసి రోడ్డును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల పరిధిలోని శివరామపురం గ్రామం నుంచి గార్గేయపురానికి 4 కి.మీ దూరం ఉంది. గ్రామానికి రాకపోకలు సాగించే బీటీ రోడ్డు పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉంది. ఈ రహదారిపై గుంతలు పడటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భగత్ సింగ్‌కు నివాళి

కర్నూలు(రూరల్): భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘువేంద్ర, అబ్దుల్లా పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో ఆదివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో షటిల్ టోర్నీ నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి డీవైఎఫ్ఐ నాయకులు నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అంజి, నాయకులు హరి కిషన్ రెడ్డి, సుధాకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

గడివేముల: వారంతా గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-1999 సంవత్సరం వరకు కలిసి చదువుకున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకుని ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అల్లరి చేష్టలు, మధుర స్మృతులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరూ ఒక్కచోట కూర్చొని భోజనం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులు జయమ్మ, శివారెడ్డి, రామసుబ్బయ్య, షంషీర్‌మియ్యా, సద్దాం ఉశేన్, రమణ, వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గోవర్ధనగిరి తదితరులను సన్మానించారు. పూర్వవిద్యార్థి, జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సంపత్, రాజశేఖర్, మాబాషా, ప్రతాప్‌రెడ్డి, వేణు, వలి, రామలింగం, ఖలీద్, అరుణ, చైతన్య, కవిత, శివజ్యోతి, బేబి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు